www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 డిసెంబర్ 2022
5
అన్నమయ్య



పోలీస్‌స్టేషన్‌లో డిఐజి తనిఖీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిఐజి సెంథిల్‌కుమార్

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం కర్నూల్ రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రికార్డులను నిషితంగా పరిశీలించారు. పోలీసులకు వృత్తిపరంగా సమస్యలున్నాయా అని ఆరాతీశారు. తర్వాత లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన విషయాల్లో ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ రమేష్ కుమార్‌కు సూచించారు. ఆయన వెంట ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, డిఎస్‌పి శ్రీధర్, రూరల్ సిఐ లింగప్ప, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెకు సిఎం వరాలజల్లు

- అభివృద్ధికి మరిన్ని నిధులిస్తాం
- విద్యా దీవెన పంపిణీ సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహ్మన్‌రెడ్డి మదనపల్లెకు వరాలజల్లు కురిపించారు. బుధవారం మదనపల్లె పర్యటలో బాగంగా ఉదయం రేనుగుంట విమానాశ్రం నుండి మదనపల్లెకు హెలికాప్టర్‌లో స్థానిక బిటి కళాశాల గ్రౌండ్‌కు చేరుకుని అక్కడ నుండి అనిబిసెంట్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా రోడ్డు షో నిర్వహించి సభా ప్రాంగనానికి చేరుకున్నారు. కలెక్టర్ గిరీష కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పాడిన తరువాత మొదటి సారిగా సిఎం జగన్‌మోహ్మన్‌రెడ్డి మదనపల్లెకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణమైన మదనపల్లెకు ప్రత్యేక ప్రాముఖ్యతను ఇవ్వడం చాలా సంతోషకమన్నారు. సిఎం జగనోహ్మన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి నేటికి సరిగ్గా మూడన్నరేళ్లు అయిందని తెలిపారు. పిల్లలకు మనమివ్వగలిగిన ఆస్తి ఏదైనా ఉందంటే అది చదువులేనన్నారు. పేద కుటుంబాలు ఆ పేదరికం నుంచి బయటకు రావాలన్నా, ఆ కుటుంబాల తలరాతలు మారాలన్నా అది సాధ్యమయ్యేది ఎప్పుడంటే చదువనే అస్త్రంతోనేనని తెలిపారు. దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని విధంగా పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. జగనన్న విద్యా దీవెన పేరుతో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామని చెప్పారు. హాస్టల్ ఖర్చుల కోసం పిల్లలు ఇబ్బంది పడకూడదని సంవత్సరానికి రూ.20 వేలు వరకు ప్రతి పాపకు, పిల్లాడికి మేలు జరిగేలా చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి బిడ్డా పోటీ ప్రపంచంతో నిలవాలని, గెలవాలనే మంచి ఆలోచనతో మొత్తం విద్యా వ్యవస్థలోనే సంస్కరణలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. మదనపల్లెలో మెడికల్ కాలేజీ ఇప్పటికే మంజూరు చేశామని, ఇది కూడా శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు అయ్యాయన్నారు. ఈ నెలలోనే పనులు మొదలవుతున్నాయన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలలో నీళ్ల పడాలంటే రెండువేల అడుగులు లోతుకు పోతే తప్ప తాగడానికి నీళ్ల లేని పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితిని మార్చాలన్న తపనతో వాటర్ గ్రిడ్ కోసం రూ.1800 కోట్లు మంజూరు చేశామన్నారు. మదనపల్లెకే రూ.400 కోట్లు వస్తుందని, మున్సిపాల్టీ అభివృద్ధి కోసం రూ.38 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మొలకలచెరువు నుంచి మదనపల్లె ఎన్‌హెచ్ రోడ్డుకు రూ.400 కోట్లతో, మదనపల్లె-తిరుపతి ఎన్‌హెచ్ రోడ్డుకు మరో రూ.1600 కోట్లతో మంజూరు ఇప్పించామన్నారు. మదనపల్లె బిటి కాలేజీ కూడా ప్రభుత్వంలో విలీనం చేశామని, టిప్పుసుల్తాన్ మసీదు కోసం రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం రూ.30 కోట్ల ప్రతిపాదనలు ఇచ్చారని, వాటిని కూడాఆమోదిస్తున్నానని పేర్కొన్నారు. మదనపల్లె టౌన్ పరిధిలో 3 బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడం కోసం మరో రూ.14 కోట్లు అడిగారని, అదీ మంజూరు చేస్తున్నామన్నారు. బహుదా నదిమీద బ్రిడ్జి కోసం అవసరమైన మరో రూ.7 కోట్లు కూడా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, కడప జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, చిత్తూరు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మైనార్టీ కమిషన్ ఛైర్మన్ ఇక్బాల్ అహ్మద్, శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం, కుప్పం ఎమ్మెల్సీ భరత్, రాయచోటి, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, రాజంపేట ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నవాజ్ భాష, మల్లికార్జున్‌రెడ్డి, కర్నూలు రేంజి డిఐజి సెంథిల్ కుమార్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఏపీఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, ఏపీఎండిసి ఛైర్‌పర్సన్ షమీం అస్లం, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మదనపల్లె మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజరెడ్డి పాల్గొన్నారు.





విద్యా దీవెన పంపిణీ కార్యక్రమంలో చెక్‌ను అందజేస్తున్న సిఎం జగన్, ప్రజాప్రతినిధులు, అధికారులు



హమీదాకు రూ.లక్ష చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ గిరీష

నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి

- సిఎంను కలవాలని వచ్చిన బాధితురాలిని అడ్డుకున్న పోలీసులు
- అంతలోనే చిన్నారికి తీవ్ర అస్వస్థత
- సకాలంలో వైద్యం అందించి కాపాడిన డాక్టర్లు



చిన్నారికి వైద్యం అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహ్మన్‌రెడ్డి మదనపల్లె పర్యటకు వస్తున్నారని తెలుసుకొని ఆయనను కలిసి తనబిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుందామని వెలుతుంటే పోలీసులు అనుమతి లేదని ఆమెను ఆదిలోనే ఆపివేశారు. తన బిడ్డ వింత వ్యాధితో బాధపడుతూ ప్రాణాలతో కొట్టుమిట్టులాడుతున్నాడని సిఎం సార్‌ను కలిసి తన బిడ్డను రక్షించాలని కోరుతానని పోలీసులకు విన్నవించుకున్నా పోలీసులు మానవత్వం లేకుండా ససేమీరా అనుమతి లేందటూ వెనక్కి పంపించడంతో బాధితురాలు హమీదా బోరున ఏడ్చింది. అంతలోనే చిన్నారి తీవ్ర అస్వస్థకు గురై స్పృహతప్పి పోవడంతో అక్కడే ఉన్న ఎస్ఐ షేక్ జాఫర్ చిన్నారిని తీసుకొని సమీపంలో ఉండే ఆంబులెన్స్ వద్దకు చేర్చాడు. అంబులెన్స్‌లోని వైద్యులు డాక్టర్ ప్రవీన్‌కుమార్, డాక్టర్ కిషోర్, డాక్టర్ ఆరీఫుల్లా, డాక్టర్ చైతన్యజ్యోతి సకాలంలో వైద్యం అందించి చిన్నారిని కాపాడారు. తంబళ్ళపల్లి మండలం ఎద్దులవారిపల్లెకు చెందిన హమీదాను మదనపల్లెకు ఇచ్చి వివాహం చేశారు. ఆమెకు ఏడాదన్నర కొడుకు ఉన్నాడు. కొడుకు పుట్టినప్పటి నుండి వింత వ్యాధితో (తల పెద్దది కావడం, రోజుకు 30 సార్లు ఫిట్స్ రావడం) వంటి వ్యాధితో బాధపడుతన్నాడని, తాను వేలూరు సిఎంసిలో చికిత్సలు చేయిస్తున్నానని, తన భర్త ఏమాత్రం పట్టించుకోడని, ఇప్పుడు డబ్బులు లేక తన బిడ్డకు చికిత్సలలు నిలిపివేశారని బాధితురాలు వాపోయింది. సిఎం స్పందించి తన బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంది.

స్పందించిన ముఖ్యమంత్రి జగన్

హమీదా కుమారుడు మొహమ్మద్‌అలీకి వ్యాధి గురించి తెలుసుకున్న వెంటనే చలించిపోయిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ గిరీషను ఆదేశించారు. సిఎం ఆదేశాల మేరకు వెంటనే స్పందించి రూ.లక్ష చెక్కును అందజేశారు. నెలవారీ రూ.3 వేలు పింఛను మంజూరు చేశారు. స్విమ్స్‌లో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. హెలీప్యాడ్ వద్ద ఆమెతో సిఎం మాట్లాడారు. స్పందించిన సిఎం, కలెక్టర్‌కు హమీదా కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న మానవత జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌యాదవ్

నైతిక విలువలతో ఉత్తమ జీవితం

ప్రజాశక్తి-గాలివీడు

నైతిక విలువలతో ఉత్తమ జీవితం గడపవచ్చని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి జూనియర్, డిగ్రీ (అర్ఆర్‌జిఆర్) కళాశాలలో బ్లడ్ గ్రూప్ క్యాంపెన్, విద్యార్థిని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఇంటర్‌లో మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అర్షియా, గాయత్రీ, మధుకావ్యకు ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా పది మందికి మంచి చేయాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు.విద్యార్థులు, మానవ విలువల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. అనంతరం సంస్థ ఛైర్మన్ సుబ్బారెడ్డి, కన్వీనర్ శివారెడ్డి లు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ తెలియపరిచే పరీక్షలు నిర్వహించి ఐడి కార్డులు అందజేశామన్నారు. బ్లడ్ గ్రూప్ తెలియడం ద్వారా భవిష్యత్‌లో రక్తదానం వంటి వాటికి అత్యవసర సమయాల్లో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. గామీణ ప్రాంత విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చక్కగా అవగాహన చేసుకొని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, పట్టుదలతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి బహుమతులు ప్రదానం చేశామని, భవిష్యత్తులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గాలివీడు శాఖ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రా రెడ్డి, సంస్థ మాజీ అధ్యక్షులు నరసింహులు, సభ్యులు డాక్టర్ శంకర్, బక్కు, విశ్వనాధరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు వెంకట రమణా రెడ్డి, రామచంద్ర, బాలయ్య, కళాశాల అధ్యాపకులు రవి, మహేష్ నాయుడు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లెలో రైళ్ల నిలుపుదలకు జిఎం హామీ

ప్రజాశక్తి వార్తకు స్పందన



రెడ్డిపల్లె స్టేషన్ సమస్యను జిఎంకు వివరిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పుల్లంపేట

రెడ్డిపల్లె రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లను నిలుపుదల చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్ హామీ ఇచ్చారు. గత నెల 20వ తేదీన ప్రజాశక్తిలో "రెడ్డిపల్లిపై ఎందుకింత నిర్లక్ష్యం..?" అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. రెడ్డిపల్లె రైల్వేస్టేషన్‌కు సంబంధించి గుంతకల్ డివిజన్ రైల్వే బోర్డు మెంబర్ తళ్లెం భరత్ కుమార్‌రెడ్డి జిఎంను కలిసి సమస్య వివరించారు. కరోనా ముందు ఈ స్టేషన్లో తిరుపతి-హుబ్లీ, కడప-అరకోణం ప్యాసింజర్ రైళ్లను ఆపేవారని, ప్రస్తుతం నిలుపుదల చేయడం లేదని చెప్పారు. వాటిని యథావిధంగా కొనసాగించాలని జిఎంకు విజ్ఞప్తి చేశారు. జిఎం సానుకూలంగా స్పందించి తప్పకుండా రెడ్డిపల్లి స్టేషన్‌లో ప్యాసింజర్ రైలు నిలుపుదల చేస్తామని హామీ ఇచ్చారు. రైల్వే బోర్డు మెంబర్ అయిన భరత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డిపల్లె నా పల్లె అని తెలిపారు. అవసరం అయితే గుంతకల్ డిఆర్ఎం, మళ్లీ సికింద్రాబాద్‌కు వెళ్లి జిఎంను కలిసి కచ్చితంగా రెడ్డిపల్లె రైల్వేస్టేషన్లో ప్యాసింజర్ రైళ్ల నిలుపుదల చేయిస్తానని పేర్కొన్నారు. రెడ్డిపల్లి చుట్టుపక్కల 35 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ రైల్వే జిఎం సమయాభావం లేనందువల్ల రైల్వే కోడూరు స్టేషన్లో కూడా ఆగకుండా వెళ్ళినా కూడా రెడ్డిపల్లిపై ఉన్న మమకారంతో రైల్వే బోర్డు మెంబర్ హుటాహుటిన రేణిగుంట జంక్షన్‌కి వెళ్లి అక్కడ జిఎంను కలిసి రెడ్డిపల్లె సమస్యపై వివరించానని పేర్కొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన జాగరణ



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బుధవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన ధర్నాను అడ్డుకొని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నాయకులు నిరసన జాగరణ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, డిఎ బకాయిలను కాలయాపన లేకుండా వెంటనే చెల్లించాలని కోరుతూ నవంబర్ 7వ తేదీన అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించామని పేర్కొన్నారు. ధర్నా తరువాత కూడా ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోగా కనీసం చర్చలకు కూడా ఆహ్వానించలేదన్నారు. ఇందుకు నిరసనగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద నవంబర్ 30వ తేదీన ధర్నా చేపడతామని ముందుగానే ప్రభుత్వ అనుమతి కోసం నోటీసు ఇచ్చినప్పటికీ పోలీసులు అనుమతి ఇచ్చి మరల అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అని తెలిపారు. సంఘ నాయకులను, ఎమ్మెల్సీ లను అరెస్టు చేయడం దారుణమన్నారు. వారి అరెస్టులను ఖండిస్తూ, పోలీసుల దమణకాండను నిరసిస్తూ బుధవారం రాజంపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన జాగరణ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు నిర్వహించ తలపెట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, సి.రమణమూర్తి, జిల్లా కౌన్సిలర్ రౌఫ్ బాషా, రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.నాగేశ్వర గౌడ్, రాజంపేట మండల అధ్యక్షుడు ఎం.రమణయ్య, ప్రధాన కార్యదర్శి జి.నాగేంద్ర, కోశాధికారి కె.శివ కుమార్, పెనగలూరు మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా రావు, కోశాధికారి వినోద్ కుమార్, పుల్లంపేట మండల ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, నందలూరు మండలాల ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న విక్టర్

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గాలివీడు

గర్భిణీలకు, బాలింతలకు బుధవారం తూముకుంట గ్రామ సచివాలయంలో వైద్య పరీక్షలు చేపట్టారు. సోలార్ పవర్ ప్రాజెక్టు వారి సహకారంతో ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం, తల్లులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా జర్మనీ నుంచి విక్టర్ డైరెక్టర్ రాల్స్‌వాక్ హాజరయ్యారు. కార్యక్రమంలో వెంకట రామ్మోహన్, శశి టెక్నికల్ కమర్షియల్ మేనేజర్ రాజశేఖర్, ప్లాంట్ మేనేజర్ స్వర్ణలత, ఎంపిటిసి ఆంజనేయరెడ్డి కాసింపీరా, గర్భిణులు, బాలింతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ


ప్రజాశక్తి - రాయచోటి

అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించనున్నట డాక్టర్ పి శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల చిత్తూరు రోడ్డు వరకు ర్యాలీ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం రాయచోటి డిగ్రీ కళాశాలలో సమావేశం ఉంటుందన్నారు.

స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్‌ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో అద్భుతంగా రాణించిన ఆయుఫా, నందిని స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్‌ఐటిలో సీట్లు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సబిత హర్షం వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ కోటాలో ఆయుపాకు ఇడుపులపాయ క్యాంపస్‌లో సీటు రాగా నందినికి ప్రకాశం జిల్లా క్యాంపస్‌లో సీటు లభించినట్లు పేర్కొన్నారు. సాఫ్ట్ బాల్ క్రీడలో పాఠశాల స్థాయి నుండి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుతంగా రాణించి మెరుగైన ప్రదర్శన చేసి చదువులో కూడా ఉత్తీర్ణత సాధించడంతో ట్రిపుల్‌ఐటికి ఎంపిక య్యారన్నారు. చదువు తోపాటు క్రీడల్లో కూడా రాణించినప్పుడే మెరుగైన ఫలితాలు అందుకోవచ్చున్నారు. వారిని క్రీడల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్లాను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.



ఆయుఫా



నందిని

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు



క్రీడల్లో సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

పుల్లంపేట: మండల పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగాలలో సత్తాచాటి 15 మంది ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీహరి తెలిపారు. చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన ఎంపికలలో మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారన్నారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో మోహన్ సాయి, వెంకట అశోక్, మంజుల, రమ్య, కల్పన, బేస్‌బాల్ విభాగంలో భార్గవ్, శివ మహేష్, నవదీప్, సుస్మిత, నికిత, హరిత, మంజుల, కల్పన, రమ్యా ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండర్-19 రబ్బీ పోటీలలో ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఉమాదేవి, వెంకట అశోక్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందిస్తూ అందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు నీలకంఠంను అభినందించారు. పాఠశాలలోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ఈ విధంగా సత్తా చాటాలని పేర్కొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలుకు ఎంపికైన ఎపిఆర్‌జెసి విద్యార్థులు

ఎస్‌జిఎఫ్‌కు గ్యారంపల్లి విద్యార్థులు..

పీలేరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న కెవిపల్లి మండలం, గ్యారంపల్లి ఏపిఆర్‌జెసి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివయ్య, పిడి నరేంద్ర తెలిపారు. బుధవారం వారు ఈ మేరకు మీడియాకు సామాచారం అందించారు. అండర్-17, అండర్-19 విభాగాల్లో జిల్లా స్థాయిలో తమ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. అండర్-19 విభాగంలో ఖోఖోలో యోగీశ్వర్, సాఫ్ట్‌బాల్‌లో బంకార్ నాయక్, బ్యాస్కెట్ బాల్‌లో నవీన్, ఆర్చరీలో పరమేశ్వర ఉన్నారు. అలాగే అండర్-17 విభాగంలో ఎంపికైన వారిలో టెన్నికాయిట్‌లో ప్రబాస్, యోగలో లక్ష్మీకాంత్ రెడ్డి, పెన్సింగ్ ఇబ్రహీమ్ ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ చెన్నకేశవులు, భూపతి, రామకృష్ణాంజనేయులు, రమాదేవి, ప్రభావతి, అన్నపూర్ణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఘనంగా రాజ్యాంగ వారోత్సవాలు

ప్రజాశక్తి-నందలూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో బుధవారం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం 6 నుండి 14 ఏళ్ల బాలబాలికలకు కల్పించిన నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు కొరకు భారత ప్రభుత్వం పిల్లలు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు చట్టం 2009లో ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం పిల్లలకు 6 ఏళ్లు నిండే దాకా వారి బాల్యం రక్షించుకొనుట, విద్యా అవకాశాన్ని కల్పించడానికి పాటుపడాలని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి చట్టాలుకు లోబడి స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించిందన్నారు. మానవ అక్రమ రవాణా వెట్టి చాకిరి నిషేధించబడినదని, అట్టి వాటికి పాల్పడినచో చట్ట ప్రకారం నేరస్తులు అవుతారని హెచ్చరించారు. భారత దేశ పరిధిలో అందరూ చట్టం ముందు సమానులేనన్నారు. భారత న్యాయ సేవాధికార సంస్థ వారు బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2015లో రూపొందించడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు జి.శివశంకర్ రెడ్డి, కళాశాల, స్కూల్ సిబ్బంది, ఎంఎల్ఎస్‌సి సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి లత



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ

మెనూ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన విద్యార్థులకు ఆసరాగా ఉన్నటువంటి సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడంలో గాని, మెనూ ప్రకారం పెట్టకుండా వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం మూడు నెలల నుండి విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదన్నారు. తక్షణమే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైనటువంటి ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ప్రతినెలా వైద్య తనిఖీలు నిర్వహించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. వార్డెన్‌లపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని తెలిపారు. అప్పుడే వారి నిజ స్వరూపాలు బయటపడతాయన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాజంపేట నాయకులు సాయి కిషోర్, సిరాజ్, హర్షవర్ధన్, యుగేందర్ పాల్గొన్నారు.



బిందుశ్రీకి చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నీట్ పరీక్షలలో 583 మార్కులతో 29,479వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 970వ ర్యాంకు సాధించి తిరుపతి నగరంలోని ఎస్వీ వైద్య కళాశాలలో సీటు సాధించిన పుల్లంపేట మండలం తిప్పాయపల్లెకు చెందిన నల్లబసాయిగారి బిందుశ్రీకి కళాశాల, వసతి, పరీక్ష ఫీజులకు అవసరమైన ఆర్థిక సాయాన్ని స్నేహ హస్తాలు ఫౌండేషన్ ముందుకు వచ్చింది. బుధవారం రాజంపేట పట్టణంలోని సాతపల్లె ఎంపిపి పాఠశాలలో ఫౌండేషన్ ప్రతినిధులు రాము వయ్యావుల, తిరుపతి ఐఐటి కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వెంకయ్య చింతలపూడి, చైతన్యలు బిందుశ్రీకి రూ.లక్ష చెక్కును అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిందుశ్రీ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి, పేదరికం చదువుకు అడ్డుకాకూడదని సాతపల్లెలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి విజయలక్ష్మి ప్రోత్సాహంతో స్నేహ హస్తాలు ఫౌండేషన్ ద్వారా తనకు ఆపన్న హస్తం లభించిందని తెలిపారు.

'ఇదేమికర్మ'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి నిమ్మనపల్లి

డిసెంబర్ రెండో తేదీ నుంచి నిర్వహించే 'రాష్ట్రానికి ఇదేం కర్మ' కార్యక్రమంలో నాయకులు, కారకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని తెలుగు యువత అధ్యక్షులు చినబాబు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో జరుగుతున్న వైఫల్యాలను ప్రజలకు వివరించటానికి, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలన గురించి వారికి చైతన్యం కల్పించాలని సూచించారు. మదనపల్లి నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలని తెలిపారు. ప్రధానంగా యువత ముందుకు రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని విజయపథంలో నడిపించాలని తెలిపారు.



శ్మశాన వాటికకు భూమిపూజ చేస్తున్న ముస్లిములు

శ్మశాన వాటికకు భూమిపూజ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిములకు కేటాయించిన శ్మశాన వాటికకు బుధవారం భూమిపూజ చేశారు. పట్టణ జనాభాకు సరిపడా శ్మశాన వాటికల కోసం హిందూ, ముస్లిం, క్రైస్తవులకు పెద్దకారంపల్లె పంచాయతీలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ గిరీష ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముస్లిములకు కేటాయించిన స్థలంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు, పట్టణ మసీదుల కార్యవర్గ సభ్యులు, జాహిద్ అలీ, అబ్దుల్ మునాఫ్, అబూబకర్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ పోటీలకు 'అంబేద్కర్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కడప జిల్లా చక్రాయపేట మండలం గండి గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల చెందిన విద్యార్థులు విజయం సాధించి రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ తెలిపారు. ఖోఖో, కబడ్డీ అండర్-19 కబడ్డీలో భార్గవి, దివ్య, హారిక, ఎంపికయ్యారన్నారు. అండర్-19 ఖోఖోలో స్నేహ వైష్ణవి, నందిని, వెంకటేశ్వరి, భారతి, సుస్మిత ఎంపికైనట్లు తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్‌లో స్రవంతి, ప్రమీల, శ్రీలత, ప్రణతి ఎంపికయ్యారన్నారు. వీరిలో నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, పీడీ అంజలి, పిఇటి షబానా హర్ష వ్యక్తం చేశారు.



ఖోఖో, కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కష్టపడితే ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చు

అన్నమాచార్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి

ప్రజాశక్తి -రాజంపేట

ఎవరైనా ఇష్టపడి, కష్టపడి పనిచేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అన్నమాచార్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. గంగిరెడ్డి విద్యా రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి మలేషియాకు చెందిన సెయింట్ మథర్ థెరిసా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిన విషయం విధితమే. ఈ డాక్టరేట్ అవార్డును స్వీకరించి మొదటిసారిగా కళశాలకు విచ్చేసిన డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, సతీమణి శశికళను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం గంగిరెడ్డి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని తెలిపారు. తమకు ఈ అవార్డు రావడానకి తన కృషి, పట్టుదలతోపాటు తమ కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, తమ కళాశాలల్లో పనిచేసే సిబ్బంది తోడ్పాటుతో ఈ విజయం సాధించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ నాలెడ్జి నాలెడ్జి ఉంటుందని దానిని సరైన పద్ధతిలో ఉపయోగించక విఫలం అవుతుంటారన్నారు చిన్నతనం నుండే తాను అకుంఠిత దీక్ష పట్టుదలతో ముందుకు వెళ్లానన్నారు ఆ ఫలితం నేడు తనకు దక్కిందన్నారు 25 సంవత్సరాల విద్యారంగంలో విద్యారంగంలో తాను చేసిన సేవలకు ఇది ప్రతిఫలం అన్నారు పదిమంది బాగుండాలని వారికి విద్యాదానం చేయాలని నా కృషి నేడు నెరవేరుతుందన్నారు ఎవరైనా హార్డ్ వర్క్ చేస్తే వారికి విజయం దాసోహం అవుతుందన్నారు గెలుపు ఓటములు సహజమని వాటిని స్ఫూర్తిదాయకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. డాక్టర్ చొప్పా గంగిరెడ్డికి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ తమ సోదరుడు కృషి, పట్టుదలకు మారుపేరని, ఆయన కష్టార్జితమే ఇంతటి ఘనవిజయాన్ని సాధించడం జరిగిందని, ముస్ముందు ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ ఏదైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు నిరుత్సాహం చెందకుండా ముందుకు సాగడం ద్వారా ఎటువంటి పనినైనా సాధించవచ్చని తమ తండ్రిని చూసి నేర్చుకున్నానని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అభించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం తమకెంతో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ విద్యా ప్రధాన విద్యార్థులకు అందించిన సేవలు గురించి కొనియాడారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్స్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గంగిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ ఆవరణలో బుధవారం పారిశుధ్య కార్మికులతో కలిసి జమ్మలమడుగు పట్టణ మహాసభలు నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ విజయ్‌కుమార్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు శివనారాయణ ముఖ్యఅతిథులుగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. పోరాటాల ఫలితంగానే కార్మికుల హక్కులు సాధించుకోగలమన్నారు. భవిష్యత్తులో కార్మికులకు ఏ అన్యాయం జరిగినా పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. పట్టణ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు .పట్టణ అధ్యక్షులు నాగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి శేఖర్, పట్టణ కోశాధికారి శివన్నతోపాటు 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు గురజాడ అప్పారావు 107వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశం అంటే మనుషులోయ్' అని సమాజానికి చెప్పిన గొప్ప దేశ భక్తుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. స్త్రీ జనోద్ధరణ, సంఘ సంస్కరణ, భాషోద్యమం ఈ మూడింటిని సమానంగా నడిపించిన మార్గదర్శి గురజాడ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, సత్తార్, చెన్నకేశవ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య పాల్గొన్నారు.

సిఎం పదవికి రాజీనామా చేయాలి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ఎపి నుంచి తెలంగాణ రాష్ట్రానికి బదిలీ చేయడం పట్ల నైతిక విలువలు పాటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి రాజీనామా చేయాలని బుధవారం పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నీలం సంజీవరెడ్డి, నేదురుపల్లి జనార్దన్‌రెడ్డి కోర్టులు ప్రతికూల వాఖ్యలు చేసినందుకు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి నైతిక విలువలు నెలకొల్పారన్నారు. సుప్రీంకోర్టు జగన్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవిగా ఆయన పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఎన్నికల సిబ్బందిగా ఉంటే ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయని.. అలా అయితే వైసిపి ఓడిపోతుందని భయం సిఎంకు జగన్‌కు పట్టుకుందని తెలిపారు.

హమాలీలకు కూలి రేటు పెంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో ఉన్న 29 బేవరేజ్ డిపోలలో పని చేస్తున్న హమాలీలకు ఎగుమతి కూలి రేటు పెంచాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారెడ్డి కోరారు. బుధవారం కడప ఐఎంఎల్ గోడౌన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న కూలి రేటు 2021, అక్టోబర్ 31తో ముగిసిందని పేర్కొన్నారు. పలుమార్లు ఎపిఎస్‌బిసిఎల్ ఎండి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సిగ్మా సంస్థ అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకవెళ్లామని చెప్పారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కూలి రేటు రూ.7 నుంచి రూ.10కి పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కె.రఘురామ్య, ప్రతినిధులు ఆర్.సుబ్బరాయుడు, ఎల్.మనోహర్‌రెడ్డి, జి.రెడ్డి ప్రసాద్, సుబ్బారెడ్డి, నరేష్, కొండారెడ్డి, భరత్, వేణు, హమాలీలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం ఉద్యమాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఐసిడిఎస్ పరి రక్షణ కోసం ఉద్యమాలు మరి ంత ఉధృతం చేస్తామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పదవ రాష్ట్ర మహాసభలు గుంటూరు నగరంలో మూడు రోజులపాటు నిర్వహించారని తెలిపారు. ఈ మహాసభలలో పలు తీర్మానాలు చేశారని పేర్కొన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్లో నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ప్రయివేట్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కాలంలో విధి నిర్వహణలో మరణించిన అంగన్వాడీ కుటుంబాలకు రూ. 50 లక్షల బీమా వర్తింపచేయాలని చెప్పారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. మహాసభలలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారని చెప్పారు. కడప నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బి.లక్ష్మీదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆర్. లక్ష్మీదేవి, ఆదిలమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా నాయకురాలు ఎంపి అంజనాదేవి పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశానికి అవ సరమైన భావి శాస్త్ర వేత్తలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి జ్యూరీ సభ్యులు గవర్న మెంట్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి కృష్ణారెడ్డి అన్నారు. బుధ వారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఘనంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(అప్ కాస్ట్) జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో 124 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు. వీటి నుంచి ఏడు ప్రాజె క్టులను రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ అధికారి ఎస్ .ఎం .రెహ మాన్, రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు, అకడమిక్ సమన్వ యకర్త ఆర్ శ్రీనివాసులురెడ్డి, జ్యూరీ సభ్యులుగా డాక్టర్ రామచంద్ర పాఠశాల ప్రధా నోపాధ్యాయులు నాగమణి బాల శాస్త్ర వేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **అట్లూరు విద్యార్థి ప్రతిభ** సైన్సు కాంగ్రెస్‌లో అట్లూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి జస్వంత్ ప్రతిభను చాటారు. 'జీవనశైలిలో వ్యాధుల నివారణ- సాంప్రదా యక ఆహారం పాత్ర' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కడప

నివారణ తప్ప చికిత్స లేని వ్యాధి ఎయిడ్స్ అని, యువత ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం . రమేష్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్స వాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపల్ మాట్లా డుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ఎయిడ్స్ వ్యాధి ముఖ్య మైందన్నారు. యువత ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచిం చారు. అనంతరం విద్యార్థులకు 'ఎయిడ్స్ నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి. శివరామకృష్ణ, డాక్టర్ ఏ. నాగరాజు, డాక్టర్ వై సావిత్రి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం : జడ్జి

ప్రజాశక్తి - వల్లూరు/కడప

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవ సరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొ న్నారు. బుధవారం మం డల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినిలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ పిల్లలకు చదువుకునే సమయంలోనే చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యాహక్కు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల నేరస్తులు వంటి చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు 1098 కు సమాచారం ఇవ్వాలన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థినిలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి సురేష్ బాబు, విద్యార్థినిలు పాల్గొన్నారు. **విద్యార్థులకు బహుమతులు అందజేత..** రాజ్యాంగ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, యాదాల రంగమ్మ జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చాగంటి'కి గురుజాడ పురస్కారం సరికాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రవచనాలు చెప్పే చాగంటికి గురజాడ అప్పారావు అవార్డు ఇవ్వడం సరికాదని జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం అన్నారు. బుధవారం జెవివి ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయ భావజాలం కలిగిన కవి పేరు స్థాపించిన అవార్డును చాగంటికి ఇవ్వడం సముచితం కాదని పేర్కొన్నారు. గురజాడ అడుగుజాడల్లో ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్న వారికి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.కె.సరస్వతి, జిల్లా ఉపా ధ్యక్షులు బాబు, వెంకటసుబ్బయ్య,ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సమతా కన్వీ నర్ పద్మావతి, జిల్లా కార్యదర్శి సునీత, కార్యదర్శి ఐయ్యవారు రెడ్డి, కోశాధి కారి సమీర్‌బాషా, నగర ఉపాధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, విద్యా కమిటీ కన్వీ నర్ ఆరోగ్యమేరి, కార్యకర్తలు రామేశ్వరమ్మ, మధు,రామమోహన్ పాల్గొన్నారు.



పాడి రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ ప్రతాప్

ముద్దచర్మ వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ ఆధ్వర్యంలో బుధవారం తొగురుపేట పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం, తొగురుపేట, పులపుత్తూరు గ్రామాలలో ముద్ద చర్మ వ్యాధిపై అవగాహన సదస్సు మరియు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్త పశువులకు చికిత్సలు చేసి మందులు సరఫరా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న పశువులకు టీకాలు వేశామని తెలిపారు. కొన్ని పశువులు ఇతర ప్రదేశాల నుంచి మేత కొరకు చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాలలో తిరుగుతూ టీకాలకు సహకరించలేదని తెలిపారు. సంబంధిత పశువుల యజమానులు ఆయా గ్రామాల నుంచి సహకరించినట్లయితే వాటికి కూడా టీకాలు అందించి వ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పాడి రైతు సోదరులు వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని తమ సిబ్బందికి తెలియపరచి వ్యాధిని అరికట్టడంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్.చెర్లపల్లి పశువైద్య అధికారి డాక్టర్ ఎన్.శరత్ కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, పశు వైద్య సహాయకులు ఎ.రాజేంద్రప్రసాద్, దత్తాత్రేయ పాల్గొన్నారు.

అన్ని రైళ్లు నిలుపుదల చేయాలని జిఎంకు వినతి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో అన్ని రైళ్ల నిలుపుదలతో పాటు మూతపడిన లోకోషెడ్ స్థానంలో నూతన పరిశ్రమ ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ వినతి పత్రం అందజేశారు. బుదవారం రేణిగుంటలోని సియార్ఎస్‌లో జిఎంకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అందజేసిన లెటర్‌లను అందజేశారు. నందలూరు, రాజంపేట రైల్వే కేంద్రాలలో కరోనా ముందు ఆగుతున్న రైల్లు అన్ని ఆపాలని, వెంకటాద్రి, రాయలసీమ, దాదర్, జయంతి, జనతా రైళ్లను నందలూరులో ఆ పాలని కోరామన్నారు. రన్నింగ్ రూమ్ క్రూ కంట్రోల్ తరలించడం తగదని అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. రాజంపేటలో గతంలో లాగే అన్ని రైళ్ల స్టాపింగ్గ్ ఇవ్వాలని కోరామన్నారు. హజరత్ నిజాముద్దీన్, జయంతి జనతా, హరిప్రియ, రైళ్ళకు వీలైనంత త్వరగా స్టాపింగ్ ఇవ్వాలన్నారు. పరిశీలించి న్యాయం చేస్తామని జిఎం హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, నరసింహ, రవి పాల్గొన్నారు.



మొహియుద్దీన్‌ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిఎం జగన్

సిఎం సమక్షంలో వైసిపిలో చేరిన మొహియుద్దీన్

ప్రజాశక్తి-కలికిరి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో పిసిసి కార్యదర్శి ఆగ మొహియుద్దీన్ వైసిపిలో చేరారు. బుధవారం మదనపల్లిలో జరిగిన ముఖ్యమంత్రి సభలో ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మొహియుద్దీన్ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలోకి ఆహ్వానించినందుకు ముఖ్యమంత్రి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలను నిరాశపర్చిన సిఎం పర్యటన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెను జిల్లా చేయకుండా, మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పర్యటన నిరాశపర్చిందని విడుదలై చిరుతైగల్ కట్చి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ అన్నారు. సభకు రూ.ఐదు కోట్ల ప్రజా ధనం ఖర్చు చేసిన ప్రభుత్వం, మదనపల్లె అభివృద్ధికి ఏమీ భరోసా ఇవ్వలేక పోయిందని తెలిపారు. కేవలం బటన్ నొక్కడానికి ఇంత బహిరంగ సభ అక్కర్లేదని, ఆ బటన్ నొక్కుడు తాడేపల్లి ప్యాలెస్ నుండే చేసుంటే సరిపోయేదని విమర్శించారు. కుప్పంలో బహిరంగ సభ పెట్టి, ఆ నియోజకవర్గ అభివృద్ధికి రూ.3 వేల కోట్లు ప్రకటించారన్నారు. మదనపల్లెలో పెట్టిన బహిరంగ సభలో ఈ నియోజకవర్గ అభివృద్ధికి కనీసం రూ.వంద కోట్లు ప్రకటించలేదని, ఇది మదనపల్లె ప్రజల్ని అవమానించడం కాదా అని ప్రశ్నించారు.

రేపు గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-రామాపురం

సుద్దమల గ్రామపంచాయతీలో ఈనెల 2న గడపకుగడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నారని, కార్యక్రమానికి ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొంటారని ఎంపిడిఒ హైదవర్‌వలి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిన విషయాన్ని ప్రతి గడపకూ వెళ్లి ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి వివరిస్తారని తెలిపారు.

సహదేవరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-రామాపురం

రోడ్డు ప్రమాదం మృతి చెందిన వంగిమల సహదేవరెడ్డి(40) మృతదేహానికి బుధవారం మాజీ శాసనసభ్యుడు గడికోట మోహన్ రెడ్డి పూల మాలవేసి నివాళులర్పించారు మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపు వాండ్లపల్లికు చెందిన వంగిమళ్ల సహదేవరెడ్డి మంగళవారం రాత్రి బొగ్గులేటి పల్లి సమీపంలోని భారత్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులు స్వగ్రామం తీసుకొచ్చారు. స్థానిక నేతలతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలు ఆదుకుంటామన్నారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు, మాజీ ఎంపిపి గడికోట ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామమోహన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులపట్ల ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నాం

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్ము చెల్లించని కారణంగానే యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అయినా చలనం రాకపోవడంతో విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇచ్చినట్లు ఇచ్చి తిరిగి తాము ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించకుండా యుటిఎఫ్ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసుల తీరును ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 9 విడతల డిఏ బకాయిలు వేల కోట్లలో ఉంటుందని చెప్పారు. వాటిని చెల్లించలేని ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై అణచివేత ధోరణిని అనుసరించడం ఆటవిక పాలనను గుర్తుకు చేస్తోందని, అసలు ఇక్కడ ప్రజాస్వామ్య పాలన జరుగుతుండా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివా రెడ్డి, జి. రాధాక్రిష్ణ, అక్రం బాష, చంద్రశేఖర్, మండల నాయకులు వెంకట్రమణా రెడ్డి, విశ్వనాథ్, విజయ్, రఫి, విశ్వనాథ రెడ్డి, చెంగా రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.